# స్వతంత్ర విధానాలు అవలంబిస్తామంటున్న నేపాల్

**నేపాల్‌లో** రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగాను, పరిశీలించ దగ్గవిగానూ ఉన్నాయి. రాచరిక వ్యవస్థ అనంతరం నేపాల్‌లో ఎక్కువ కాలం రాజకీయ అనిశ్చితే కొనసాగింది. రెండు దశాబ్దాల్లో ఏ ప్రభుత్వమూ 8 లేదా 9 నెలలు మనుగడ సాగించలేదు. రాజకీయ పార్టీల్లో ఎన్నో సంకీర్ణాలు, కూటములు ఉండేవి. రాజ్యాంగాన్ని రూపొందించటం అతికష్టంగా మారింది.

నేపాల్‌లో ప్రస్థుతం నేపాల్ యునైటెడ్ మార్క్సిస్టు లెనినిస్టు (మావోయిస్టు)ల, సీపీనేపాల్ సంకీర్ణ ప్రభుత్వం వుంది. ఈ రెండింటికి కలిపి మూడింట రెండొంతుల మెజారిటీ వుంది. (174/275) దీంతో తమ పాలన స్థిరంగా ఉంటుందని చెపుతూ వివిధ సమస్యలపై తమ వైఖరిని ఆ పార్టీలు ప్రకటిస్తున్నాయి. అమెరికా, ఇంగ్లండ్‌లలో బహుళ జాతి కంపెనీలకు, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా దేశీయ ఉత్పత్తుల రక్షణ విధానం ఉందని నేపాల్ విదేశాంగ మంత్రి ప్రదీప్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. అలాకాకుండా నేపాల్‌లో ప్రజాబాహుళ్యపు ఆకాంక్షల కనుగుణంగా విధానాలుంటాయన్నాడు. నేపాల్ ప్రజలు స్వతంత్రంగా వుండాలనుకుంటారు. అభివృద్ధి మార్గాలను, పాలనా విధానాలను, విదేశీ విధానాలను తామే నిర్ణయించుకునే అధికారం వుందన్నారు. గతంలో అనేక సందర్భాలలో తమ అంతర్గత విధానాలు ద్వైపాక్షిక అంశాలుగా ఉండేవన్నారు.

తమ ప్రధాని ఇతర దేశాలు సందర్శించి నపుడు రాజ్యాంగం గురించి వ్యాఖ్యానించినపుడు కలత చెందామన్నాడు. ప్రస్తుతం తాను ఓడినా ఈసారి తన లక్ష్యాన్ని నెరవేరుస్తామని ప్రధాని అనడం వింతగా తోచిందన్నాడు. ఇండియా, చైనా దేశాలతో చర్చల సందర్భంగా తమ అంతర్గత వ్యవహారాలు, ద్వైపాక్షిక అంశంగా ఉండకూడదని స్పష్టం చేయదలచామన్నాడు. తమకొక స్వతంత్ర విదేశీ విధానం ఉందన్నాడు. గతంలో తమ ప్రధానులు ఇతర దేశాల విధానాలకు అనుకూలంగా ఉంటామని ఐక్యరాజ్య సమితి తదితర ప్రపంచ వేదికలలో హామీ ఇవ్వడం జరిగిందన్నాడు. ఇది ఇంకెంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, నేపాల్ స్వతంత్ర దేశమని ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. నేపాల్‌కు స్వయం ప్రాధాన్యత వున్నట్లే, ఇండియాకు కూడా ప్రాంతీయ, అంతర్జాతీయ దృక్పథాలున్నా యన్నారు. అయితే తాము ఇందులో భాగస్వాములం కాదన్నారు. ఇండియాతో ప్రత్యేక సంబంధం గురించి మాట్లాడుతూ 'ప్రత్యేక' పదానికి విస్తృతార్థం ఉందని, మేధావుల బృందం ఇండియాతో తమ సంబంధాలను విశ్లేషిస్తోందని, 1950 ఒప్పందాన్ని పరిశీలించి ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా దాన్ని సవరించాల్సి ఉందని నేపాల్ విదేశాంగమంత్రి ప్రదీప్ అన్నారు. నేపాల్ ప్రధాని కేపీఓలి 2018 జూన్ 23న బీజింగ్‌లో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తమ భూభాగంపై తమ పొరుగుదేశాల ప్రయోజనా లకు విరుద్ధంగా ఎటువంటి కార్యకలాపాలు అనుమతించబోమన్నాడు. దీన్ని తాము ఖచ్చితంగా పాటిస్తామని అలాగే పొరుగుదేశాలనుంచి అదే హామీ కోరుతామన్నాడు. ఇండియా, చైనా సంబంధాలపై మాట్లాడుతూ రెండు పొరుగు దేశాలకు నేపాల్ అనుసంధానంగా ఉంటుందని తాము నమ్ముతున్నట్లు చెప్పాడు. సరిహద్దులను దాటి విస్తృత సంబంధాలు నెలకొల్పుకోవాలని అభిలషిస్తున్నట్లు చెప్పారు.

నేతలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు నేపాల్ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయి. గత ప్రభుత్వాల వైఖరి నుంచి పాఠాలు నేర్చుకున్నట్లుగా కనబడుతోంది. ఇండియాలాంటి పొరుగు దేశం దోపిడీ స్వభావాల వల్ల వారు ఈ అభిప్రాయంతో ఉన్నట్లు కనబడుతోంది.

మనం ప్రస్థుతం సామ్రాజ్యవాద ఆధిపత్యం లోని పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్నాం. చిన్న, బలహీనమైన దేశాలు సామ్రాజ్యవాద దాడుల ఆటంకాలను ఎదిరించి, స్వతంత్ర మార్గం అనుసరించటం చాలా కష్టమైనపని. బలమైన, పరస్పర ఆధారిత ప్రజాస్వామ్య పునాదులు ఏర్పడటాన్ని కాలమే నిర్ణయిస్తుంది. రాజకీయంగా నిలదొక్కుకుని, రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ పూర్తి స్వతంత్ర నేపాల్ సాధించే మార్గంలో అణగారిన వర్గాల మద్దతు కూడగట్టటం ద్వారానే విజయం సాధ్యమౌతుంది.

ooooo